ఓం నమో భగవతే శ్రీరమణాయ

రమణభాస్కర

(కాకినాడలో శ్రీ నాన్నగారి ప్రవచనము, 3-5-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

చైతన్యము నీ హృదయంలో ఉంది. చైతన్యము నీకు నేనుగా వ్యక్తమయినపుడు నీవు పూర్ణస్థితిని పొందుతావు. దానినే హిందువులు మోక్షం అంటున్నారు. బౌద్ధమతస్థులు నిర్వాణం అంటున్నారు. క్రైస్తవులు స్వర్గరాజ్యం అంటున్నారు. ఉన్నది ఒక్కటే వస్తువు. ఒకో మతంలో ఒకో పేరుపెట్టి పిలిచారు. ఆ స్థితిని పొందటానికి నీకు ఇతరులు అడ్డు రావటంలేదు. నీ మనస్సే నీకు అడ్డువస్తోంది. 6 సంవత్సరాలు తపస్సు చేసి దొరికాడు దొంగ అన్నాడు బుద్ధుడు. మనస్సుయొక్క మూలంలోనే సుఖం ఉంది, ఆనందము ఉంది. ఆ సుఖము, ఆనందము నాకు అనుభవంలోనికి రాకుండా మనస్సే అడ్డువస్తోంది. మనో మూలం తెలియగానే దొరికాడు దొంగ అన్నాడు బుద్ధుడు. ఆనందము హృదయంలోనే ఉన్నప్పటికీ అది అనుభవంలోనికి రాకుండా అడ్డువచ్చేది ఆయన మనస్సే అని అప్పుడు ఆయనకు తెలిసింది.

దేవుడు ఉన్నాడా, లేడా అని బుద్ధుని అడిగితే ఏమి చెప్పేవాడు కాదు. మౌనం వహించేవాడు. మధ్యవర్తులతో సంబంధం లేకుండా నీ హృదయంలో ఉన్న ఆనందస్థితి దగ్గరకు నిన్ను తీసుకొనిపోవడానికి బుద్ధుడు ప్రయత్నం చేసాడు. నీకు ఆనందం లేనపుడు, శాంతి లేనపుడు దేవుడు ఉన్నాడు అని చెప్పినా, లేడు అని చెప్పినా ఒక్కటే. నోటితో దేవుడు ఉన్నాడు అని చెపుతాము అనుకోండి. దానికి సంబంధించిన అనుభవం నీకు లేనపుడు దానికి సంబంధించిన సుఖంకూడా నీకు తెలియదు. దేవుడు ఉన్నాడు, లేడు అనే సమస్యకంటె నీ హృదయంలో ఉన్న సుఖాన్ని డైరక్టుగా నీకు అనుభవంలోనికి తీసుకొని రావటానికి బుద్ధుడు ప్రయత్నం చేసాడు. ఆనందము నీ హృదయంలోనే ఉంది. నీకు దేహబుద్ధి ఉండటంవలన అది ఎక్కడో దూరాన ఉన్నట్లు నీకు అనిపిస్తోంది. నేను లోపల ఉన్నాను, నాకు బయట ప్రపంచం ఉంది అని అనుకోవటానికి కారణంకూడా దేహబుద్ధి.

బుద్ధుడు శరీరం విడిచిపెట్టేటప్పుడు ఆయన సవతి తమ్ముడు ఆనంద్‌కు కన్నీరు వచ్చింది. బుద్ధుడు ఏ నిర్వాణ స్థితిని పొందాడో ఆ స్థితిని నీవు కూడా పొందటానికి ప్రయత్నం చెయ్యి. అంతేగాని నా గురించి విలపించి కాలమును, శక్తిని వృథా చేసుకోవద్దు అని బుద్ధుడు ఆనంద్‌కు చెప్పాడు. వాడు బుద్ధుడు అంటే. ఏ మతం అయినా జగత్తు, జీవుడు, ఈశ్వరుడు ఈ మూడింటిమీద ఆధారపడి ఉంటుంది. మతాలు అన్నీ ఏ మూడింటిమీద ఆధారపడి ఉన్నాయో ఆ మూడూ కూడా మనస్సుయొక్క కల్పితము అన్నారు భగవాన్. మనస్సు అణిగిపోయినపుడు మనస్సును ఆశ్రయించుకొని ఉన్నవి అన్నీకూడా అణిగిపోతాయి.

చనిపోయిన తరువాత ఏమౌతాము అని అందరూ అనుకొంటూ ఉంటారు. చనిపోయిన తరువాత ఏమౌతాము అని ఇలా అనుకొనేవారికి ఎవ్వరికీ గాఢనిద్రలో మనం ఎక్కడ ఉంటున్నాము అనే ప్రశ్న రావటంలేదు. గాఢనిద్రలో మనం ఉంటున్నాముగాని ఎక్కడ ఉంటున్నామో మనకు తెలియటంలేదు. గాఢనిద్రలో ఎక్కడ ఉంటున్నామో మరణానంతరముకూడా మనం అక్కడే ఉంటాము.

మరణించిన తరువాత వైకుంఠమునకు వెళదామని, కైలాసమునకు వెళదామని పుణ్యాలు చేస్తారు. నీవు వెళ్ళే వైకుంఠముగాని, కైలాసముగాని పారమార్థిక సత్యం కాదు. నీ మనస్సు ఎంత నిజమో వైకుంఠము, కైలాసము అంతే నిజము అని భగవాన్ చెప్పారు. వైకుంఠము, కైలాసము, స్వర్గలోకము ఇవి అన్నీ సుందరమైన కొమ్ము అని ఆయన చెప్పలేదు. ఇవి అన్నీ వ్యావహారిక సత్యములు. ఆ లోకములకు వెళదామనుకొనే వాడు

ఎంత నిజమో అవి అన్నీకూడా అంతే నిజము. చైతన్యము తప్పించి మిగిలినవి అన్నీ మనస్సుయొక్క కల్పితములు. మనస్సు అణిగితేనేగాని మనస్సు కల్పించినవి అణగవు. మనస్సు అణగటం ఎలాగ? ధ్యానంవలనగాని, విచారణవలనగాని ఇవి రెండూ చేయలేకపోతే సత్పురుషుల సహవాసంవలనగాని మనస్సు అణగుతుంది.

దేహం చనిపోతుంది. మనస్సు చనిపోవటం లేదు. నేను చనిపోతున్నాను అని మనస్సు అనుకొంటోందిగాని శరీరం అనుకోవటంలేదు. అదే Wrong Identification. దేహముతో మనస్సు తాదాప్యం పొందుతోంది. అందువలన దేహం చనిపోయినపుడు నేను చనిపోతున్నాను అని మనస్సు అనుకొంటోంది. దేహం లేకపోయినా మనం ఉండవచ్చు. దేహము లేకపోతే మనం ఉండమేమోనని భ్రమవలన మరల birth కావాలి అని కోరుకొంటున్నాము. చనిపోయిన తరువాత గొడవ వదిలివెయ్యి. గాఢనిద్రలో నీకు దేహం గొడవలేదు. అక్కడ శాంతిగా ఉన్నామా. అశాంతిగా ఉన్నామా అంటున్నారు భగవాన్. అక్కడ శాంతిగానే ఉన్నాము. మన Existance అంతా దేహమునకే పరిమితమై ఉంది అనుకోవటంవలన దేహం పోతుంది అంటే భయం వస్తుంది.

మన హృదయంలో దేవుడు ఉన్నాడు అంటే మనకు ఇష్టం ఉండదు. తిరుపతిలో దేవుడు ఉన్నాడు. అరుణాచలంలో దేవుడు ఉన్నాడు అంటే మనకు ఇష్టం. అందరి హృదయాలలో నేను ఆత్మగా ఉన్నాను అని కృష్ణుడు మొదట చెప్పాడు. అది ఎవరూ పట్టించుకోరు. నేను రాముడుగా ఉన్నాను, కృష్ణుడుగా ఉన్నాను. శివుడుగా ఉన్నాను అంటే ఇది Correct అనుకొంటున్నాము. ఆ గుడికి పరిగెడుతున్నాము. మనం అందరము తలకాయలో వేరు. వేరుగా ఉన్నాము కాని హృదయంలో ఒకటిగానే ఉన్నాము. అందుచేత మనం నోరు మూసుకొని హృదయాన్ని తెరిస్తే సత్యం మనకు తెలుస్తుంది. కాని మనం హృదయాన్ని మూసుకొంటున్నాము. నోరు తెరుస్తున్నాము. మన controller మన హృదయంలోనే ఉన్నాడు. మన controller ఎక్కడో తిరుపతిలోనో, అరుణాచలంలోనో లేదు. వెంకటేశ్వరస్వామి దేవుడు, అరుణాచలేశ్వరుడు దేవుడు అనుకొంటున్నాము. నీవు దేహము కాకపోయినా దేహముతో ఎలా తాదాప్యం పొందుతున్నావో అలాగ ఆరాయితో దేవుడు తాదాప్యం పొందుతున్నాడు. నీవు దేహముతో తాదాప్యం పొందటం ఎంత సత్యమో ఆ రాయితో దేవుడు తాదాప్యం పొందటంకూడా అంతే సత్యంగాని అది పారమార్థిక సత్యం కాదు.

నీవు దేహము అనుకొన్నప్పుడు, మనస్సు అనుకొన్నప్పుడు కూడా నీవు వాటికి అతీతంగానే ఉన్నావు. నీవు చైతన్యంగానే ఉన్నావు. అది నీకు తెలియకపోవచ్చును. తెలుసుకొంటే సుఖపడతావు. తెలియకపోతే దుఃఖం నిన్ను వెంటాడుతుంది. (నాకు ఒక దేహము ఉంది అని నీవు అనుకొంటే ఇబ్బంది లేదు. దేహమే నేను అనుకొంటేమాత్రం బ్రహ్మానుభవం పొందటానికి అదే నీకు అడ్డువస్తుంది అంటున్నారు భగవాన్.) నీవు మాట్లాడే మాటలలోగాని, నీ ఆలోచనలలోగాని, నీవు చేసే పనిలోగాని నీ దేహబుద్ధిని పెంచుకొంటూ వెళితే నీకు బ్రహ్మానుభవం కలగటానికి దేహబుద్ధే ఆటంకం అవుతుంది. మనం ఏదైనా పనిచేస్తే ఆ పని దేహబుద్ధినుండి విడుదల పొందటానికి నీకు సహకరించాలి. అప్పుడు అది యోగం అవుతుంది. నీవు చేసే కర్మనే యోగముగా చెయ్యి.

(నాదిని విడిచిపెడితే చిత్తశుద్ధి కలుగుతుంది. నేనును విడిచిపెడితే జ్ఞానం కలుగుతుంది అని భగవాన్ చెప్తూ ఉండేవారు.) నీవు దేహబుద్ధిని పెంచుకొంటూ ఉంటే సద్వస్తువు నీకు అత్యంత సమీపములో ఉన్నప్పటికీ అది నీకు తెలియదు. దేహబుద్ధిని ఎంతవరకూ తగ్గించుకొంటున్నావో బ్రహ్మానుభవం కలగటానికి అంతవరకూ అది నీకు సహాయం చేస్తుంది. నీకు దేహము తెలుసు, మనస్సు తెలుసు అంటున్నావు. వాటినే బ్రహ్మానుభవం పొందటానికి ఉపయోగించుకో. బ్రహ్మానుభవం పొందటానికి దేహమును, మనస్సును ఎంతవరకూ ఉపయోగించుకొంటున్నావో అంతవరకే నీవు జీవించినట్లు లెక్క. మిగిలినదంతా వ్యర్థమే. శాస్త్రవాసన, లోకవాసనలకంటె దేహవాసన బలీయమైనది. నీవు ఏ మార్గములో ప్రయాణం చేసినా దేహబుద్ధిలోనుండి బయటపడితేనేగాని నీకు ఆత్మబుద్ధి కలుగదు. సాధనయొక్క ప్రయోజనము ఏమిటి ఉంటే ఈ దేహబుద్ధి నశింపజేయటమే.

నేను గ్రంథాలు అధ్యయనం చేసాను. ఈ పాండిత్యం నాకు బ్రహ్మానుభవం కలగటానికి ఉపయోగపడుతుందా అని అడుగుతున్నారు. మానవుడు వాడు ఎవడో వాడు తెలుసుకొనేవరకూ వాడు మూర్ఖుడుగానే ఉంటాడు. వాడికి చదువు ఉండవచ్చు. అంటే వాడికి మూర్ఖత్వంతోపాటు చదువు అదనంగా ఉంటుంది. మనం వస్త్రువులు మెడలో వేసుకొని ఎలా అలంకరించుకొంటున్నామో అలాగ అహంభావనను అలంకరించుకోవద్దు. నీవు అహంభావనను అలంకరించుకోవటం మానివెయ్యి. అప్పుడు నీ హృదయంలో ఉన్న చైతన్యము తానుగా నీకు వ్యక్తమవుతుంది. బ్రహ్మానుభవం పొందాలి అని అనుకొంటున్నాము కాని మనం చేసే పనులు అన్నీ అహంభావనను అలంకరించుకొనటానికి చేస్తున్నాము. గ్రంథాలు బాగా చదివాను అని చెపుతున్నావు. దేవుడు ఆ గ్రంథాలలో లేడు. నీ హృదయంలో ఉన్నాడు. నీ హృదయంలో అన్వేషిస్తే ఆయన ఎరుకపడతాడు. గ్రంధాలు చదవటంవల్లన పాండిత్యం వస్తుంది గాని జ్ఞానం సున్నా. నీ దేహం ఎంత నిజమో పాండిత్యం కూడా అంతే నిజం.

ఇప్పుడే ఇక్కడే ఈ దేహం ఉండగానే కాలమును పాడుచేసుకోకుండా నీవు ఎవడో నీవు తెలుసుకోవటానికి ప్రయత్నం చెయ్యి. మరణించిన తరువాత సాధన చేయటానికి ఏమీ ఉండదు. ఎక్కడో ఉంది అనుకొనేది ఇక్కడే ఉంది. కాని మనకు ఎక్కడో ఉంది అనిపిస్తుంది. ఇది మనస్సుయొక్క చేష్ట. హృదయగతంగా ప్రయాణించకుండా ఉండటంకోసం నీ మనస్సు అలా కల్పిస్తోంది. నీ మనస్సును కొద్దిగా హృదయంవైపుకు ప్రయాణం చేయించగలిగితే ఎక్కడో ఉంది అనుకొన్నది ఇక్కడే ఉంది. ఎప్పుడో వస్తుంది అనుకొన్నది ఇప్పుడే వస్తుంది. నీ మనస్సును వెనుకకు పంపించు. నీలోపలఉన్న చైతన్యం ముందుకు వస్తుంది. అది ముందుకు వచ్చి నీ మనస్సును Swallow చేస్తుంది. అప్పుడు చైతన్యం ఒక్కటిమాత్రమే నేనుగా మిగులుతుంది. అదే నిర్వాణస్థితి.

తనను తాను నాశనం చేసుకోవటానికి అహంభావన ఇష్టపడదు. నీకు పుణ్యాలు కావాలంటె చేసిపెడతాను. స్వర్గానికి వెళ్ళేపనులు కావాలంటే చేసిపెడతాను. నన్నుమాటుకు విచారణ చేయకు. నన్ను మినహాయించు అని అది చెపుతుంది. దానిని ప్రశ్నించటానికి అది ఇష్టపడదు. దానిని ప్రశ్నిస్తే దానికి ఉనికి లేకుండా పోతుంది. అందువలన తనను ప్రశ్నించటానికి అహంభావన ఇష్టపడదు. దానిని ప్రశ్నించే బుద్ధి మనకు కలుగుతోంది అంటే ఈశ్వరానుగ్రహం వలననే అది కలుగుతుంది. ఈశ్వరానుగ్రహం లేకుండా దానిని ప్రశ్నించే బుద్ధి మనకు కలుగదు.

పడుకోవటానికి పరుపు ఉంది అనుకో. తలక్రింద దిళ్ళు ఉంది అనుకో. పైన సీలింగ్ ఫాన్ తిరుగుతోంది అనుకో. నిద్రపోవటానికి అన్ని సదుపాయాలు ఉన్నాయి అనుకో. అయినా నీకు నిద్ర పట్టడం లేదు అనుకో. నిద్రపట్టకపోయినా ఫరవాలేదు సదుపాయాలు అన్నీ ఉన్నాయి అని ఎవరైనా అనుకొంటారా? అనుకోరు. ఈ సదుపాయాలు అన్నీ నిద్రపట్టటంకోసం ఏ విధంగా అయితే ఉపయోగించుకొంటున్నారో అలాగే భగవంతుడు ఇచ్చిన అవకాశములను మోక్షానుభవం పొందటానికి ఉపయోగించుకో. భగవదనుభవం పొందటానికి వాటిని సద్వినియోగం చేసుకో. లేనిచో నీవు చాలా నష్టపోతావు.

ధ్యానం చేయటంవలన, విచారణ చేయటంవలన Spiritual strength వస్తుంది. మనస్సుకు ఏకాగ్రత వస్తుంది. సూక్ష్మదృష్టి కలుగుతుంది. స్థూలదృష్టి ఉన్నవాడికంటే సూక్ష్మదృష్టి ఉన్నవాడు విషయమును బాగా గ్రహించగలడు. సూక్ష్మం అయిన మనస్సు, పవిత్రమైన మనస్సు మాత్రమే హృదయాభిముఖంగా ప్రయాణం చేయగలదు. సూక్ష్మదృష్టి ఉన్నవాడు శబ్దమును ఉన్నది ఉన్నట్లుగా గ్రహించగలడు. అందులో ఉన్న నిజాన్ని సూక్ష్మదృష్టి ఉన్నవాడు గ్రహించగలడు. స్థూలదృష్టి ఉన్నవాడు గ్రహించలేడు.

గాఢనిద్రలో నీ ప్రయత్నం లేకుండా మనస్సు దాని మూలంలోనికి వెళ్తుంది. జాగ్రదావస్థలో నీవు ప్రయత్నంచేసి దానిని దాని మూలంలోనికి పంపాలి. అదే సాధన. అది కేవలము నీ తెలివితేటలవల జరుగదు. దీనికి స్వప్రయత్నం, కాలపరిపక్వము, ఈశ్వర కటాక్షం అవసరము. నీవు చేయగలిగినది చెయ్యి నీవు చేస్తూ ఉంటే నీవు చేస్తున్న ప్రయత్నమే అనుగ్రహంగా మారుతుంది.

నీలోపల ఉన్న చైతన్యమునకు ధ్యానం అక్కరలేదు. దానికి ద్వితీయం లేనే లేదు. దానికంటే వేరుగా మీ లేదు. నీ దేహానికి ధ్యానం అక్కరలేదు. ఇంక ధ్యానం చేసేది ఎవరు? మనస్సు చేస్తుంది. సాధనచేసేది ఎవరు అంటే మనస్సు. మనకు వస్తువు అనుభవంలోనికి రాకుండా అడ్డువచ్చేది ఎవరు అంటే మనస్సే. ఎవడైతే సాధన చేస్తున్నాడో ఆ సాధకుడే మనకు వస్తువు అనుభవంలోనికి రాకుండా అడ్డువస్తున్నాడు అని ముందు మనం గ్రహించాలి. నేను జపం చేస్తున్నాను. నేను ధ్యానం చేస్తున్నాను అని చెపుతున్నావు. రవ్వంత, ములంత హృదయాభిముఖంగా వెళ్ళావా? ధ్యానం చేయటం మంచిదే చేయండి. కాని ఏంతసేపు ధ్యానం కుదురుతోందో చూసుకోండి. ఒక గంటసేపు ధ్యానంలో కూర్చున్నారు అనుకోండి కరెక్టుగా ఎంతసేపు ధ్యానం కుదురుతోందో చూడండి. ధ్యానం మనస్సుతో చేస్తున్నాము. ఎందుకు చేస్తున్నాము అంటే దానిని నశింపజేయటంకోసం చేస్తున్నాము. దానిని చంపటానికే ధ్యానం చేస్తున్నాము అని మనస్సు గ్రహించేసింది. అందువలన చేస్తున్నట్లుగా అది నటిస్తోంది. సాధనచేసి సాధకుడినే నశింపజేయాలి. ఏ సత్యమును నీవు తెలుసుకోవాలి అని అనుకొంటున్నావో అది నీవే. మనస్సు గొడవ వదిలెయ్యి. అది నిన్ను మోసం చేస్తోంది. అది నేను, అది నేను అని నీవు అనుకొంటున్నావు. అది నేను అనుకోవటం మానివెయ్యి. దాని అంతట అదే వాడిపోయి రాలిపోతుంది. You are the truth.

నీవు దేనినైతే పోగొట్టుకోవాలో దానినే గుర్తు తెచ్చుకొంటున్నావు. అది ఎలా పోతుంది. దానికి food supply అయిపోతూ ఉంటుంది. నీవు దేహముతోనూ, మనస్సుతోనూ తాదాప్యం చెందేబదులు హృదయంలో ఉన్న చైతన్యంతో తాదాప్యం పొందు. అప్పుడు దానికి food supply ఆగిపోతుంది. అప్పుడు దానంతట అదే సన్నగిల్లిపోతుంది. నీ సంకల్పమే నా సంకల్పము. నీ ఇష్టమే నా ఇష్టం అలా శరణాగతి మార్గంవలనకూడా మనస్సు నశిస్తుంది.

దేహము నేను కాదు అని ఉపనిషత్‌లు చెపుతున్నాయి. దేహము నేను కానపుడు దేహము నేను కాదు అని అనుకోవాలికదా. దేహము నేను అనే తలంపు నాకు ఎందుకు వస్తోంది. పూర్వజన్మలో నీవు పుణ్యం చేసినా, పాపం చేసినా దేహము నేను అనే బుద్ధితో చేసావు. ఆ ఫలితం నీచేత అనుభవింపజేయటంకోసం దేహము నేను అనే బుద్ధిని నీకు కలుగజేసాడు. దేహము నేను అనే బుద్ధి నీకు లేకపోతే ఆ ఫలితం నీకు అనుభవంలోనికి రాదు. ఆ ఫలితం నీకు అనుభవంలోనికి రావటంకోసం నీకు దేహబుద్ధి కల్పించాడుగాని అది నిజం కాదు అని చెప్పారు. దేహం దాని ప్రారబ్ధం ప్రకారం వెళుతుంది. నీవు సాధన చేయటంవలన దానితో తాదాప్యం వదలిపోతుంది. ప్రారబ్ధం ప్రకారం సంఘటనలు జరుగుతూ ఉంటాయి నీవు సాధనచేయటంవలన ఆ సంఘటనల ప్రభావం నీమీద పడదు. అప్పుడు నీవు happyగా ఉండగలవు.

అహంభావననుండి బయటపడటానికి పూజలు, జపాలు, ధ్యానాలు చేయవచ్చు. వాటికికూడా ఎంతో కొంత శక్తి ఉంది. కాని వీటి అన్నిటికంటె గురువు అనుగ్రహం అత్యంత బలీయమైనది. మీ సాధన పూజగదికి పరిమితం అవ్వకూడదు. కొంతమంది భక్తి అంతా పూజగదికి పరిమితం చేసుకొంటారు. పూజగదినుండి బయటకు వచ్చిన తరువాత ఏమీ ఉండదు. దైనందిన జీవితములో మీరు మాటాడే మాటద్వారాగాని, పనిద్వారాగాని, తలంపుద్వారాగాని అహంభావనకు food supply అవ్వకుండా చూసుకోండి. అప్పుడు మీకు తెలియకుండానే దానంతట అదే రాలిపోతుంది.

నీకు ధనం ఉండవచ్చు, చదువు ఉండవచ్చు, గౌరవము ఉండవచ్చు. ప్రారబ్ధంలో ఉంటే అవి వస్తాయి. వీటివలన అవినయం తెచ్చుకోవద్దు. అవినయం తెచ్చుకుంటే బాహ్యంగా నీవు బాగా ఉన్నా మూలంలో కుళ్ళిపోతావు. భగవంతుడు ఇచ్చినదే ఇతరులకు ఇచ్చి నేను ఇచ్చాను అనుకొంటూ అహంభావనను పెంచుకొంటున్నావు. అన్నీ ఇచ్చినది భగవంతుడే. అహంభావనను పోగొట్టుకొనే శక్తి నీకు లేకపోవచ్చును. కనీసం దానిని doubt చేయటం ప్రారంభించు అన్నారు భగవాన్. ఉంటుందా, పోతుందా అనేది తరువాత విషయం ముందు doubt చేయటం ప్రారంభించు. Doubt చేయటం ప్రారంభించటంకూడా సాధనలో ఒక భాగమే.